# సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 11 । జూలై । 2024






**కొత్త రైలు.. కూత వేసేనా?**

ఉమ్మడి జిల్లాలను కలుపుతూ ముంబై–చెన్నై రెలు మార్గం జిల్లాలో ఉంది. కానీ నడుస్తున్న రెళ్లు అరకొరే. ఏ బడ్జెట్‌లోనూ కొత్త రైళ్లు నడిపించే పరిస్థితి కనిపించడం లేదు. -8లో



**స్టాఫ్ నర్స్ నియామకాలపై సందిగ్ధత**

స్టాఫ్ నర్స్ నియామకాలపై తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఉత్తర్వులు నిలుపుదల చేయడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. -8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.520 | రూ.600 |
| రెండోరకం | రూ.380 | రూ.500 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1402 మెట్రిక్ టన్నులు



**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 370 | 455 |
| సీబీ | - | - |

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 268.960 కిలోలు

## న్యూస్‌రీల్

### నూతన నియామకం



హరినాథరెడ్డి



మహమ్మద్

రాయచోటి అర్బన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులకు డిస్ట్రిక్ట్,జోనల్ స్థాయి పదవులు లభించాయి. రాయచోటి క్లబ్ వ్యవస్థాక అధ్యక్షుడు హరినాథరెడ్డిని డిస్ట్రిక్ట్ గ్లోబర్ మెంబర్‌షిప్ టీం (జీఎంటీ) కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. లయన్ జోన్ చైర్మన్‌గా క్లబ్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్‌ను నియమించారు. ఈ మేరకు క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పీఎంజెఎఫ్ గౌతం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పదువులకు న్యాయం చేస్తామన్నారు. భవిష్యత్తులో క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

### భాకరాపేట జెడ్పీ హైస్కూల్ తనిఖీ

సిద్ధవటం: మండలంలోని భాకరాపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం వైఎస్సార్ జిల్లా డీఈఓ అనూరాధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయుల హాజరు రికార్డును, మధ్యాహ్న భోజనాన్ని, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. చిక్కీలు ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించామన్నారు. విద్యార్థుల్లో 6మంది విద్యార్థులకు చదవడం రావడంలేదని, మరోసారి తనిఖీ చేసినప్పుడు విద్యార్థులకు చదవడం రావాలన్నారు, లేదంటే చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయున్ని హెచ్చరించారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయం పాటించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శశికళ

మదనపల్లె: అంగన్‌వాడీ వర్కర్లు ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా కేంద్రాల్లో ఉండాలని, సమయపాలనలో కచ్చితత్వం పాటించాలని ఐసీడీఎస్ పీడీ శశికళ అన్నారు. బుధవారం మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో జరిగిన సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ వర్కర్స్ అవగాహన సమావేశానికి పీడీ శశికళ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రి స్కూల్ విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాకుండా తప్పనిసరిగా నడిచేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం వడ్డించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 11 ప్రాజెక్ట్‌లో 42,020 మంది ప్రి స్కూల్ పిల్లలు ఉన్నారన్నారు. ప్రి స్కూల్ పిల్లలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లోనే ఉండేలా చూడాలన్నారు. విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే(వీహెచ్ఎన్‌డీ)లో భాగంగా ప్రతినెలా మొదటి, మూడో శుక్రవారం గ్రామస్థాయిలో ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులు, బాలింతలకు అనీమియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్యవివాహాలు, ఆడపిల్ల చదువు, పోషకాహారం, బాలికాసంరక్షణ తదితర విషయాలపై అవగాహన సమావేశాలు ఏర్పాటుచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సమర్థవంతమైన నిర్వహణ, పారదర్శకత కోసం ఒక ప్రాజెక్ట్ సిబ్బంది మరో ప్రాజెక్ట్ పరిధిలో ఫీల్డ్ విజిట్‌లు చేసేలా కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాలోని 11 ప్రాజెక్ట్‌ల పరిధిలో అంగన్‌వాడీ ఖాళీలకు కలెక్టర్ ఆదేశాలతో త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, పోర్డ్ సంస్థ జిల్లా లలితమ్మ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కళ్లల్లో ఇసుక



రాయచోటికి చెందిన రహమత్ ఖాన్ గల్ఫ్ దేశం వెళ్లాడు. అక్కడ సంపాదించుకున్న డబ్బులతో ఇళ్లు కట్టుకుందామని వచ్చాడు. పునాది వేసి గోడలు కడదామని పదిరోజులుగా ప్రయత్నించినా ఇసుక దొరకడం లేదు. టీడీపీ ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తామని చెబుతోంది. వారం రోజులుగా రాయచోటిలోని మార్కెట్ యార్డుకు వస్తున్నా..పోతున్నా.. ఇసుక సమాచారం ఇచ్చేవారు లేరు. బయట కొందామంటే ట్రాక్టర్ ఇసుక రూ. 4 వేలు నుంచి రూ. 5 వేలు చెబుతున్నారు. అలాంటప్పుడు ఉచిత ఇసుక అనడం సబబేనా? అని ప్రశ్నిస్తున్నారు.

- చెప్పిందొకటి..చేసిందొకటి
- ఉచితం అంటూనే ధర వసూలు
- అన్నమయ్య జిల్లాలో స్టాక్ పాయింట్లలో కనిపించని ఇసుక



రాయచోటి మార్కెట్ యార్డులో ఇసుక లేకపోవడంతో ఖాళీగా కనిపిస్తున్న డంపింగ్ యార్డు

రాయచోటి: ఇసుక ఉచితంగా ఇస్తామని కూటమి నేతలు ఊదరగొడుతున్న మాటలకు.. అందించే విధానాలకు పొంతన లేకుండా ఉంది.లోడింగ్, రవాణా చార్జీల పేరుతో ధరలు నిర్ణయించి వినియోగదారులపై భారం మోపుతున్నారు. అలాంటప్పుడు ఉచిత ఇసుక అనడం సబబేనా? అని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు

సీనరేజ్, నిర్వహణ ఖర్చులు మాత్రమే వసూలు చేస్తారని చంద్రబాబు సర్కార్‌లోని నాయకులు, అనుకూల పత్రికలు, అనుకూల సోషల్ మీడియాలో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. అయితే ఉచితంగా ఇసుక తెచ్చుకుందామని వెళ్లిన వారికి ఆశాభంగం ఎదురైంది. జిల్లాలోని డంపింగ్ యార్డులన్నీ ఖాళీగా కనిపిస్తుండటంతో చంద్రబాబు ప్రభుత్వ మార్క్ మోసానికి గురయ్యామని ప్రజలు ఆలోచనలో పడ్డారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇసుక డంపింగ్ యార్డుల్లో కనిపించకపోయేసరికి ప్రైవేటు వారిని ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడ కూడా టీడీపీ అనుకూల వ్యక్తులకు చెందిన ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్న ఇసుకను మాత్రమే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. మిగతా వారికి చెందిన ట్రాక్టర్లు ఇసుకతో బయట కనిపిస్తే అధికారుల చర్యలకు గురి కావాల్సిందే. దీంతో ట్రాక్టర్ ఇసుక తెచ్చుకోవడానికి కనీసం రూ. 4 వేలు, గరిష్టంగా రూ. 6 వేలకు పైబడి ఖర్చు చేయాల్సి వస్తోందని సామాన్య ప్రజానీకం వాపోతుంది. అందుకే ఖర్చులిస్తే చాలు అనే షరతు విధించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ సంబరానికి ఉచితం అని ఎన్నికల ప్రచారం చేసుకోవడం ఎందుకనే ప్రశ్న ఎదురవుతోంది. చంద్రబాబు పదేపదే ఇసుక ఉచితంగా ఇస్తామంటే నిజంగా ఇస్తారని నమ్మి ఓట్లు వేశామని, ఇప్పుడు మోసపోయామని లబోదిబో మంటున్నారు.

**అధికార పార్టీదే ఇసుక.....**

ఉచిత ఇసుక టీడీపీ, అక్కడక్కడ జనసేన నాయకులకు మాత్రమే. అధికార పార్టీల నాయకులు టన్ను రేటు నిర్ణయించి దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. చంద్రబాబు ఏదైనా చెబితే, అందులో తిరకాసు ఎలా ఉంటుందో ఉచిత ఇసుక సరఫరానే నిదర్శనమని జనం చర్చించుకుంటున్నారు.

**ఇసుక రీచ్‌లు మూడే.....**

అన్నమయ్య జిల్లా పరిధిలో రాజంపేట సమీపంలోని చెయ్యేరు నదిలో మూడు రీచ్‌లను అధికారులు గుర్తించారు. టంగుటూరు, నారాయణ నెల్లూరు, కోమంతరాజుపురం ప్రాంతాల్లో రీచ్‌లను గుర్తించారు. వీటితోపాటు గతంలో ఉన్న బాలరాచపల్లి, కలికిరి సమీపంలోని బహుదా (గుండ్లూరు) నది రీచ్‌లను ప్రస్తుతం గుర్తించలేదు. రాజంపేట సమీపంలో గుర్తించిన రీచ్‌ల నుంచి రాయచోటి, మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు ప్రాంతాలకు ఇసుకను తరలించాలంటే రవాణా ఖర్చులు తలకు మించిన భారం అవుతాయని మదనపడుతున్నారు.



రాజంపేట పరిధిలోని మందరం డంపింగ్ యార్డులో ఇలా..

**ఖాళీగా డంపింగ్ యార్డులు**

ఇసుక కోసం డంపింగ్ యార్డులకు వెళ్లిన భవన నిర్మాణ వినియోగదారులకు ఖాళీ ప్రదేశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 8వ తేదీ నుంచి ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వ ఆదేశాలు జిల్లాలో ఎక్కడా కనిపించడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా నిర్మాణాలు జరగడంలేదు. ఫలితంగా కూలీలకు తగినంత పనిలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కలికిరి పరిధిలోని గుండ్లూరు డంపింగ్ యార్డులో..

## ‘ఉచిత ఇసుక’.. అబద్ధం

- ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా ఇసుకను అందించాలి
- ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీగోవింద రెడ్డి

పోరుమామిళ్ల (అట్లూరు): ప్రస్తుత ప్రభుత్వం ఉచిత ఇసుక అనేది అబద్ధమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక అనేది అబద్ధమని, ఉచితం పేరుతో ఇసుక దోపిడీకి చంద్రబాబు తెరలేపారని ఆయన ఆరోపించారు. ఒకవైపు ఉచితం అంటూనే రీచ్‌లలో రేట్లతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు సీఎం చంద్రబాబు తూట్లు పొడుతున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో ఇసుక మీద ఖజానాకు రూ.750 ఏడానికి ఆదాయం వచ్చేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ డబ్బు అంతా టీడీపీ నేతల జేబుల్లోకి వెళుతుందని విమర్శించారు. ఎక్కడికక్కడ పత్రికల్లో ప్రకటలు ఇచ్చి పారదర్శకంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇసుక అందజేసిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ దిగిపోయేనాటికి 80 లక్షల టన్నుల ఇసుక ఉందని, ఇప్పుడు 45 లక్షల టన్నుల ఇసుక ఉందని చంద్రబాబు అంటున్నారని, మిగిలిన 35 లక్షల టన్నుల ఇసుక ఏమైందని ప్రశ్నించారు. ఈ ఇసుకను టీడీపీ నాయకులు కొట్టేశారని ఆయన ఆరోపించారు. వెంటనే ప్రజలకు ప్రజలకు అవసరమైన మేర ఇసుకను డిమాండ్ చేశారు. ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇసుకను అందించాలని తెలిపారు.

## హంద్రీ–నీవా ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక ఇవ్వండి

- నిధుల అవసరం, పనుల పూర్తికి మంత్రి నిమ్మలకు వివరించిన సీఈ, ఎస్ఈలు
- అన్నమయ్య, చిత్తూరులోని 3 రిజర్వాయర్లకు నీళ్లివ్వాలంటే పీబీసీ విస్తరణ పనులు జరగాలి

బి.కొత్తకోట: ఏపీఆర్ హంద్రీ–నీవా ప్రాజెక్టు మొదటి, రెండో దశకు సంబంధించిన పెండింగ్ పనులు, వాటి పూర్తికి అయ్యే ఖర్చు, ప్రస్తుత స్థితి గతులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ప్రాజెక్టుపై మంత్రి సమీక్షించారు. పనులు, కృష్ణా జలాలు కుప్పం వరకు తరలించాలంటే ఎదురవుతున్న ఇబ్బందులు, నీటి ప్రవాహ సామర్థ్యం, చేపట్టాల్సిన పనులను మంత్రికి అధికారులు వివరించారు. జలవనరులశాఖ అధికారుల సమాచారం మేరకు..కర్నూలు నుంచి మొదలయ్యే ప్రధాన కాలువ నుంచి తరలించే కృష్ణా జలాలు చిత్తూరుజిల్లా చివర్లో ప్రాజెక్టు అంచులోని కుప్పంకు తరలించాలంటే ప్రస్తుతం ఉన్న స్థితిలో మార్పులు చేయాలని అధికారులు సూచించారు. ప్రధానకాలువ ప్రవాహ నీటి సామర్థ్యం 3,850 క్యూసెక్కులు అయితే కాంక్రీట్ లైనింగ్ పనులు జరగని కారణంగా 2,500 క్యూసెక్కుల కంటే తక్కువ ప్రవాహం సాగుతోంది. ఈ సమస్యను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 6,300 క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో పనులు చేపట్టింది. ఈ వెడల్పు పనులు పూర్తి చేశాక, సత్యసాయిజిల్లా కదిరి నుంచి మొదలయ్యే పుంగనూరు ఉపకాలువ వెడల్పు పనులు అన్నమయ్యజిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలం నుంచి చిత్తూరుజిల్లాలోని పెద్దపంజాణి వరకు జరగాల్సి ఉంది. ఇక్కడి నుంచి మొదలయ్యే కుప్పం ఉపకాలువకు లైనింగ్ పనులు చేస్తే డీపీఆర్ మేరకు నీటి తరలింపు సునాయాసం అవుతుందని వివరించారు. పుంగనూరు ఉపకాలువ వెడల్పుకు ముందు గతేడాది వర్షాలకు కాలువ దెబ్బతిన్న చోట్ల కాలువ పనులు వెడల్పు చేసి కాంక్రీట్ లైనింగ్ చేస్తే భవిష్యత్‌లో చేపట్టే పనులకు ఇబ్బంది ఉండదని మంత్రి దృష్టికి తెచ్చారు. అన్నమయ్య, చిత్తూరుజిల్లాలోని ముదివేడు, ఆవులపల్లె, నేతికుంటపల్లె రిజర్వాయర్లకు కృష్ణాజలాలను సామర్థ్యం పెరిగే పుంగనూరు ఉపకాలువ ద్వారా తరలించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కాలువకు కృష్ణా జలాలు తరలించే హంద్రీనీవా–జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు అనుసంధాన పనులు 40శాతం పూర్తయినట్టు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు డీపీఆర్ మేరకు పనులు పూర్తి చేస్తే కృష్ణాజలాలను పూర్తిస్థాయిలో తరలించుకునే వీలుందని సమీక్షలో మంత్రికి వివరించారు. కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయితే కుప్పం వరకు నీటిని తరలింపులో అవరోధాలు ఉండవని తేల్చి చెప్పారు. ఆయకట్టుకు నీటిని ఇవ్వొచ్చని చెప్పారు.

**ఆయకట్టుతో సమగ్ర నివేదిక**

ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులకు నీటిని అందించడం సహా పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. కాలువల లైనింగ్, కాంక్రీటు పనులు, పెండింగ్ పనులు ఏ మేరకు ఉన్నాయో మంత్రి సమీక్షించారు. తర్వాత ఈ పనులు పూర్తి చేసేందుకు ప్రాధాన్య క్రమంలో ఏఏ పనులు చేపట్టాలి, ఆయకట్టుకు సాగు నీటిని అందించాలంటే అందుకు అయ్యే వ్యయం, మొత్తం ప్రాజెక్టు పనులను ఐదేళ్లలో పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను మంత్రి కోరారు. ఈ సమీక్షలో ఈఎన్‌సీ నారాయణరెడ్డి, అనంతపురం సీఈ నాగరాజు, మదనపల్లె, అనంతపురం ఎస్ఈలు రాజగోపాల్, దేశినాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అతిసార నివారణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: జిల్లాలో డయేరియా (అతిసార) ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అతిసార నివారణ చర్యలు, జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ, ఇమ్యూనైజేషన్, డేటా ఎంట్రీ అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ మండల వైద్యాధికారులు, సీహెచ్ఓలు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా వస్తున్న ప్రాంతాలలో నీటి పరీక్షలు కూడా చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున జూన్, జులై మాసాలలో ఎక్కువగా కేసులు వస్తాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఎంహెచ్ఓ డా.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

- మధ్యాహ్న భోజన పథకం పటిష్టంగా అమలవ్వాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా విద్యాశాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై జిల్లా విద్యాశాఖ, పౌరసంబంధాల శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది.. ఎలా అమలు అవుతోంది.. తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

## ప్రవీణ్‌పై వేటుకు రంగం సిద్ధం!

- ప్రొద్దుటూరు, కమలాపురం ఎమ్మెల్యేల ఫిర్యాదు
- అధిష్టానంలో చలనం.. చర్యలకు సిఫార్సు
- కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబంపై కూడా చర్యలు



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీలో అంతర్గత ముసలం పుట్టింది. వ్యతిరేకుల్ని సాగనంపే పనిలో ఎమ్మెల్యేలు నిమగ్నమయ్యారు. ప్రొద్దుటూరు ఇన్‌చార్జి గండ్లూరు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి కుటుంబాలపై తొలివిడతగా వేటుకు రంగం సిద్ధమైంది. ఇదివరకూ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారనే ఆయా ఎమ్మెల్యేలు ఆరోపణలు చేశారు. ఆదే విషయాన్ని టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. ఆమేరకు చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.

- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి ఇద్దరూ గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఆమేరకు ఇరువురు ఎమ్మెల్యేలు ఆధారాలు కూడా అందజేసినట్లు సమాచారం. పోలింగ్ ఏజెంట్లుతో సహా పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన విధంపై ఉదాహరణలతో వివరించినట్లు తెలుస్తోంది. అలాగే కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబం తన విజయానికి కృషి చేయలేదని కడప ఎమ్మెల్యే ఆర్ మాధవి రెడ్డి ఫిర్యాదు చేశారు. కాగా గత 3పర్యాయాలుగా ఉమాదేవి కార్పొరేటర్‌గా విజయం సాధించారు. గడిచిన ఎన్నికల్లో టీడీపీ ఏకైక కార్పొరేటర్‌గా నిలవడం విశేషం. టీడీపీ కడప టికెట్ ఆశిస్తూ వచ్చారు. అనూహ్యంగా మాధవీరెడ్డి తెరపైకి రావడంతో ఉమాదేవి వెనుకంజలో పడ్డారు. మొన్నటి ఎన్నికల్లో ఉమాదేవి డివిజన్‌లో టీడీపీకి మెజార్టీ కూడా దక్కింది. కాగా, ఇటీవల కడప కౌన్సిల్ సమావేశంలో పింఛన్ల పంపిణీ వ్యవహారంలో టీడీపీ కార్పొరేటర్ అయినప్పటికీ ఆహ్వానం లేదంటూ ఉమాదేవి ఆరోపణలు కూడా చేశారు. సోమవారం అధిష్టానానికి స్వయంగా ఎమ్మెల్యేలు ఇద్దరిపై ఫిర్యాదులు చేశారు.

**రాజంపేట, తంబళ్లపల్లెల్లో...**

ఇలాంటి పరిస్థితి రాజంపేట, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో కూడా ఉత్పన్నమైంది. టీడీపీ అభ్యర్థులుగా పోటీచేసిన సుగవాసి బాలసుబ్రమణ్యం, జయచంద్రారెడ్డి అదేబాట పట్టారు. పార్టీలో ప్రత్యామ్నాయ నేతల్ని సాగనంపే చర్యల్లో నిమగ్నమయ్యారు. ఆమేరకు గ్రౌండ్ వర్క్ పూర్తి చేసినట్లు సమాచారం. ఇప్పటికే టీడీపీ అధిష్టానం దృష్టికి ఆ విషయాన్ని తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. కాగా, తమ సీట్లు లాక్కొని తమకే ఎసరు పెడుతున్నారనే భావనలో ఆయా నియోజకవర్గాల నాయకులు ఉన్నా రు. కష్టకాలంలో పార్టీ జెండా మోసి, కష్టనష్టాలు భరించిన తమలాంటోళ్లు పార్టీలో లేకుండా చేయాలనే కుట్ర చేస్తున్నారని, ఆ మేరకే ఇలాంటి చర్యలకు పాల్పడుతోన్నట్లు ఆయా నేతలు అనుచరులతో వాపోతున్నట్లు సమాచారం.



## క్రీడాస్ఫూర్తితో ఆడి ముందుకెళ్లాలి



క్రీడాకారులతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పులివెందుల టౌన్: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకుని క్రీడా స్ఫూర్తితో ముందుకు పోవాలని ఏపీ రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో వారం రోజుల పాటు జరిగే సౌత్ ఇండియా హాకీ చాంపియన్ షిప్ హాకీ క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టిపెట్టాలన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో క్రీడల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి పేద క్రీడాకారునికి మెరుగైన శిక్షణ కోసం ఖర్చు పెడతామన్నారు. అనంతరం మంత్రి క్రీడలను ప్రారంభించారు. సౌత్ ఇండియా హాకీ చాంపియన్ షిప్‌లో భాగంగా కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుండి బాలబాలికల క్రీడాకారులతో పాటు కోచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఇద్దరి ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె పట్టణం చంద్రా కాలనీకి చెందిన అశోక్ నాయక్ కుమార్తె ఎం.వర్షిణి(24) కుటుంబ సమస్యలతో సూపర్ వాస్మోల్ తాగి మంగళవారం తన ఇంటి వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే విధంగా తట్టివారిపల్లెకు చెందిన ఇమాంఖాన్ కుమారుడు పి.సమీర్ (35) కుటుంబ సమస్యలతో బుధవారం ఇంటి వద్దే పురుగులమందు, ఎలుకల మందు కలుపుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



**రామాపురం :** మండలంలోని పాలన్నగారిపల్లె వద్ద వంకలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను మండల పోలీసులు బుధవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇసుక కావాల్సిన లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డుతో అధికారులను సంప్రదించి ఇసుక తీసుకోవచ్చునన్నారు. అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పుట్టుకతో వచ్చే లోపాలు సకాలంలో గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న శివప్రతాప్

**రాయచోటి అర్బన్ :** పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలు సకాలంలో గుర్తించి తగినమేర చికిత్స అందించాలని జిల్లా ఆర్‌బీఎస్‌కె పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివ ప్రతాప్ అన్నారు. పట్టణంలోని కొత్తపేట రామాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే లోపాలు సకాలంలో గుర్తించని పక్షంలో వారు జీవితాంతం వైకల్యం ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. చిన్నతనంలో వచ్చే వినికిడి లోపంతో పిల్లలు మూగవారీగా ఉండిపోతారన్నారు. కంటి శుక్లాలు, చిన్నతనంలోనే వచ్చే పక్షవాతం సమస్యలను నయం చేసే అవకాశం ఉందన్నారు. లోపాలున్న పిల్లలను గుర్తించి మదనపల్లె పట్టణంలోని డీఈఐసికి రెఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యులు సురేష్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### హుండీ ఆదాయం లెక్కింపు

**ఒంటిమిట్ట :** ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయంలో బుధవారం 2024, జూన్ నెలకు సంబంధించి హుండీ ఆదాయం లెక్కింపు టీటీడీ అధికారుల సమక్షంలో నిర్వహించారు.స్వామి వారి హుండీ ఆదాయం రూ. 4,06,902లు వచ్చినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

# కొత్త రైలు.. కూత వేసేనా?



**కడపకు కొత్త రైళ్లు కూత పెట్టేనా అనే సందేహం ఉమ్మడి జిల్లా వాసుల్లో రేకెత్తుతోంది. గత పదేళ్లలో కొత్తగా పట్టాలెక్కిన రైళ్లు చాలా తక్కువే. ముచ్చటగా మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కారు ఈ బడ్జెట్ లోనైనా కరుణ చూపుతుందని ఉభయ జిల్లాల వాసులు ఆశలు పెట్టుకున్నారు. ఈ నెలల బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో రద్దీ, డిమాండ్ ఉన్న ఉమ్మడి జిల్లాల రైల్వే మార్గంలో కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతుందని ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు.**

- బై వీక్లీ, స్పెషల్ రైళ్లు సరే.. రెగ్యులర్ రైళ్లు లేవు
- కేంద్ర, రాష్ట్ర రాజధానులకు ఒకే ఒక్క రైలు
- ఎంపీలతో రైల్వే అధికారుల సమావేశమెప్పుడో...

**రాజంపేట :** ఉమ్మడి జిల్లాలను కలుపుతూ ముంబాయి-చెన్నై ప్రధాన రైలు మార్గం జిల్లాలో ఉంది. పేరుకే ప్రధాన రైలు మార్గం కానీ నడుపుతున్న రైళ్లు అరకొరే. ఏ బడ్జెట్‌లోనూ కొత్త రైళ్లు నడిపించే పరిస్థితులు కనిపించడం లేదు. వందే భారత్, అమృత్ భారత్ ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం ఆ రైళ్లు ఈ మార్గంలో నడిపించే సాహసం చేయడం లేదు. కోస్తా రైలు మార్గాలకు ఇస్తున్న ప్రాధాన్యం ఇక్కడ ఎందుకు ఇవ్వడం లేదని జిల్లా వాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పదేళ్లలో నంద్యాల-కడప-తిరుపతి, అరకోణం-కడప, విశాఖ-తిరుపతి-కడప (తిరుమల)రైళ్లను మాత్రమే పొడిగించి మమ అనిపించారు.

**రైల్వే లైనున్నా కొత్త రైళ్లు లేవు**

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మానస పుత్రిక కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వే లైన్ గూడ్స్ రైళ్లకే పరిమితమైంది. వెంకయ్య నాయుడు ఈ రైల్వే లైన్‌ను ప్రారంభించినపుడు ఆ మార్గంలో ప్యాసింజర్ రైళ్లను ప్రవేశపెడతామని ప్రకటించినా విజయవాడ డివిజన్ ఉన్నతాధికారులు మాత్రం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు. ముంబాయి-చెన్నై మార్గంలో గూడూరు లైన్‌కు అనుసంధానంగా నేరుగా రేణిగుంటకు వెళ్లకుండానే.. విశాఖ, ఒడిషా, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉన్న మార్గం ఇది. కనీసం నెల్లూరు, గూడూరు, విజయవాడ, విశాఖ ఆపై ప్రాంతాలకైనా రైళ్లను నడిపించడం లేదు. డెమో, మెమో రైళ్లను లోకల్‌గా తిప్పుకొనేందుకు అవకాశాలున్నా ఉపయోగం లేకుండాపోయింది. కర్నూలు, నంద్యాల, కడప, నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, నెల్లూరు మీదుగా రైలు ప్రయాణాలు కొనసాగించేందుకు వీలున్నా ఆ ప్రతిపాదనలను రైల్వే అధికారులు పక్కన పెట్టేశారు.

**రాజధానులకు ఒకే ఒక్క రైలు**

దేశ, రాష్ట్ర రాజధానులకు ఒకే రైలు నడుస్తోంది. విజయవాడకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు, దేశ రాజధానికి ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తోంది. ఈ రైలు పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో హాల్టింగ్ లేదు. రాజధానులకు కనెక్టివిటీ కలిగే విధంగా ఈ రైళ్లను నడిపే పరిస్థితి కనిపించడం లేదు. గుత్తి-రేణిగుంట డబ్లింగ్ ఉన్నప్పటికీ రైళ్ల సంఖ్య అరకొరే. ఉభయ జిల్లా మీదుగా కర్ణాటక రాజధాని బెంగళూరుకు వెళ్లేందుకు రైలు లేదు. కడప-బెంగళూరు రైల్వే లైన్ నిర్మాణం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దీంతో బెంగళూరు-తిరుపతి మధ్య నడిచే 16220 (చామరాజనగర్ ఎక్స్‌ప్రెస్) రైలును కడప వరకు పొడిగిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఈ రైలు ఉదయం తిరుపతికి వచ్చి రాత్రి తొమ్మిది గంటల వరకు సైడింగ్‌లోనే ఉంటుంది. కడప వరకు దీనిని పొడిగిస్తే తిరుపతిలో లైన్ సమస్య తీరుతుంది. ఉభయ జిల్లా వాసులకు ఉపయోగపడే ఈ రైలును ఈ బడ్జెట్‌లోనైనా పొడిగించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**ప్రతిపాదనలకు నోచని పగటిపూట రైళ్లు**

గుత్తి-రేణిగుంట రైల్వే మార్గంలో ఉభయ వైఎస్సార్ జిల్లాలోని గ్రామీణులకు ప్యాసింజర్ రైళ్ల సౌకర్యం కల్పించే ప్రతిపాదనలు ఏవీ పట్టాలెక్కడంలేదు. కేవలం నంద్యాల డెమో, అరక్కోణం, ఇంటర్‌సిటీ రైళ్లు మాత్రమే రద్దీగా నడుస్తున్నాయి. ఉదయం తిరుపతి వైపు, సాయంత్రం కడప వైపు ఓ ప్యాసింజర్‌రైలు నడిపించే ప్రతిపాదన చేయాలని ప్రయాణీకులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. గుంతకల్-తిరుపతి ప్యాసింజర్ ఈ మార్గంలో నడిపించాలనే డిమాండ్ ముందుకు సాగలేదు. తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను కడప వరకు పొడిగించాలనే ప్రతిపాదన అటకెక్కింది. తిరుపతి-విజయవాడకు జిల్లా మీదుగా ఎర్రగుంట్ల-నంద్యాల మీదుగా నడిపించే విధంగా కొత్త రైళ్లు ప్రవేశ పెట్టాలని కోరుతున్నా స్పందన లేదు. తిరుపతి నుంచి బయలుదేరి ఉదయం విజయవాడకు చేరుకునేలా, అలాగే మరో రైలు తిరుపతి నుంచి విశాఖ వరకు నడిచేలా కొత్త రైళ్లను తీసుకురావాలని రైల్వే శాఖను ప్రయాణీకులు కోరుతున్నారు.

**ఎంపీలతో సమావేశమెప్పుడో..**

కేంద్ర బడ్జెట్ సందర్భంగా ప్రతిసారీ ఏపీ ఎంపీలతో దక్షిణ మధ్య రైల్వే సమావేశం నిర్వహించడం, ఎంపీల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడం జరుగుతుంది. అయితే ఇంతవరకూ దక్షిణ మధ్య రైల్వే ఆ దిశగా అడుగులు వేయలేదని తెలుస్తోంది. ఎంపీలతో జీఎం సమావేశం కావడం, వారి నుంచి పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా సమస్యలపై వినతులను స్వీకరిస్తారు. రైలు ప్రయాణీకుల సమస్యలు, కొత్త రైళ్ల ప్రతిపాదన, స్టేషన్ల అభివృద్ధి అంశాలపై వారి అభిప్రాయాలను తీసుకొని రైల్వే బోర్డుకు ఇవ్వడం జరుగుతుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆ ప్రతిపాదన చేయలేదు.

**రద్దీని దృష్టిలో ఉంచుకొని కొత్త రైళ్లు నడపాలి**



ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కొత్త రైళ్లు నడపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సికింద్రాబాద్-తిరుపతి మధ్య కొత్తగా రైళ్లు నడపాలి. బెంగళూరుకు వెళ్లేందుకు తిరుపతి వరకూ నడిచే రైళ్లలో ఒక దానిని కడప వరకూ పొడిగిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. కృష్ణపట్నం రైల్వే లైన్ డెమో, మెమో రైలు నడిపిస్తే నెల్లూరుకు కనెక్టివిటీ పెరుగుతుంది. తిరుపతి-గుంతకల్ పగటి పూట ప్యాసింజర్ రైళ్లు నడిపించాలి. రైల్వే మంత్రిని కలిసి విన్నవిస్తాం.

– పీవీ.మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

**గ్రామీణులను దృష్టిలో ఉంచుకోవాలి**



రైల్వే బోర్డు, రైల్వే మంత్రిత్వ శాఖలు గ్రామీణ ప్రాంత ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని ప్యాసింజర్ రైళ్లను తీసుకురావాలి. రాజంపేట, కడప పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని రైలు మార్గంలో కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలి. ప్రధానంగా షిర్డీ, తిరుపతి పుణ్య క్షేత్రాలకు, తెలంగాణా, ఏపీ రాజధానులకు అనుసంధానంగా ముంబయి-చెన్నై రైలు మార్గంలో రైలు నడపాలి. కృష్ణపట్నం లైన్‌లో కడప, కర్నూలు, నెల్లూరు మధ్య డెమో, మెమో ప్యాసింజర్ రైలు తీసుకువస్తే ఉపయోగకరం.

– మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

### హత్య కేసులో నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

**రాయచోటి టౌన్ :** రమీమ్ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. రాయచోటి పట్టణం రెడ్డీస్ కాలనీలోని సిద్ధిక్ మజీద్ సమీపంలో నివాసముంటున్న షేక్ రెడ్డి బాషా కుమారుడు షేక్ రమీమ్ చికెన్ సెంటర్‌లో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై ఇంట్లో తల్లి, అక్కను డబ్బుకోసం వేధించసాగాడు. రాజుల కాలనీలో నివాసముండే రమీమ్ అక్కడ భర్త ఇర్షాద్ ఆలీ ఇది సహించలేకపోయాడు. తన స్నేహితుడు సాయి కుమార్‌తో కలిసి ఎలాగైనా అంతమొందించాలని ఈ నెల 6వతేదీన గున్నికుంట్ల రోడ్డులోని ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లారు. అక్కడ పూటుగా మద్యం తాగించి వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి ముళ్లపొదల్లో పడేశారు. కేసు నమోదు చేసి విచారించిన పోలీసులు బుధ వారం ఉదయం వీరబల్లె రింగ్ రోడ్డు సమీపంలో నిందితులను అరెస్టు చేశారు. హత్యకు వాడిన కత్తి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం, ఆయన బృందాన్ని సీఐ అభినందించారు.

### వేర్వేరు ఘర్షణల్లో ముగ్గురికి గాయాలు

**మదనపల్లె :** భూ వివాదాలతో జరిగిన వేర్వేరు ఘర్షణల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. భూ వివాదంతో గుర్రంకొండ మండలం మర్రిపాడు పంచాయతీ కురబలకోటవారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు శ్రీనివాసులు(35) మంగళవారం సాయంత్రం పొలం వద్ద ఉండగా ఆయన తమ్ముడు ఎల్లప్ప, అతడి కుటుంబ సభ్యులు దాడిచేశారు. గాయపడిన శ్రీనివాసులను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా నిమ్మనపల్లె మండలం రాచేవాటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లికి చెందిన నాగరాజ(50) గుండ్లజురుకు చెందిన కుప్పుస్వామి వద్ద పొలం కొనుగోలు చేశాడు. అయితే బుధవారం కుప్పుస్వామి దాయాదులు మునిశంకర, అతని కుటుంబసభ్యులు స్థలాన్ని చదును చేయడంతో గొడవ జరిగింది. ఈ గొడవల్లో నాగరాజుతోపాటు మరో వర్గంలోని మునిశంకర (35) గాయపడ్డాడు. బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# స్టాఫ్ నర్స్ నియామకాలపై సందిగ్ధత

- ఐదో విడత కౌన్సిలింగ్‌ను నిలిపిన టీడీపీ ప్రభుత్వం
- నిలిచిన 206 మంది స్టాఫ్ నర్స్ నియామకాలు

**గత ఐదేళ్లలో ప్రజారోగ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్టాఫ్‌నర్స్ నియామకం చేపట్టింది. నాలుగు విడతలు పూర్తిచేసి ఐదో విడత నియామకాలు చేపట్టాల్సి ఉండగా టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు నిలుపుదల చేయడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకారమే నియామకాలు చేపడతారా? లేక కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేస్తారా..? అనే సందేహాలు వారిని మానసిక వేదనకు గురిచేస్తున్నాయి.**

**కడప రూరల్ :** కడప వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 (రాయలసీమ జిలాలు) పరిధిలో 2023, నవంబరులో స్టాఫ్‌నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. పది వేలకు పైగా దరఖాస్తులు రాగా, నిబంధనలు, మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జాబితా తయారుచేసి విడతల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్హులైన వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ద్వారా ఇప్పటికే నిరుద్యోగులు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా నియమితులయ్యారు. ఒక్కో విడతలో వంద మంది చొప్పున నాలుగు విడతలుగా నియామక కౌన్సెలింగ్ చేపట్టారు. ఐదో విడతగా మదనపల్లి, పులివెందుల, ఆదోని మెడికల్ కాలేజీల్లో 206 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీ చేపట్టాల్సి ఉంది. ఎన్నికల కోడ్ రావడంతో ఆటంకం ఏర్పడింది. ఎన్నికలు ముగిసిన అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం నియామక కౌన్సెలింగ్ ప్రక్రియ నిలిపివేసింది.



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

**అనుమతుల నిలుపుదలతో సందిగ్ధం**

నాలుగు విడతలు పూర్తవగా ఐదో విడత రిక్రూట్‌మెంట్ కౌన్సెలింగ్‌పై సందిగ్ధత కొనసాగుతోంది. స్టాఫ్ నర్స్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల కౌన్సెలింగ్ నిలుపుదల ఆందోళన కలిగిస్తోంది. ఎంపికైన అభ్యర్థులు కౌన్సెలింగ్ ఎప్పుడు జరుగుతుందంటూ వాకబు చేస్తున్నారు. మదనపల్లె మెడికల్ కాలేజీకి అనుమతులు రద్దు కావడంతో పులివెందుల, ఆదోని, మదనపల్లె మెడికల్ కాలేజీలో స్టాఫ్‌నర్స్‌ల నియామకంపై ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో తెలియక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత రిక్రూట్‌మెంట్ రద్దుచేసి కొత్త నోటిఫికేషన్ ఇస్తే తమ పరిస్థితి ఏమిటనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వైద్య,ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు రెండువారాల పాటు ఎలాంటి నియామకాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. ఆ గడువు ముగిసిన తర్వాత అభ్యర్థుల అనుమానాలకు అడ్డుకట్ట పడనుంది.

# వాహనదారులూ.. హెల్మెట్ ధరించండి




మాట్లాడుతున్న జడ్జి కె. ప్రత్యూషకుమారి

**కడప అర్బన్ :** ద్విచక్ర వాహనదారులు.. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరి, జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. కడప జిల్లా కోర్టు ఆవరణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి ఆధ్వర్యంలో న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి కె. ప్రత్యూషకుమారి మాట్లాడుతూ హైకోర్టు హెల్మెట్ ధారణపై అదరూ అవగాహన కలిగి వుండాలని, తమ కుటుంబ సంక్షేమాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అతివేగం ప్రాణానికి ముప్పు అని గ్రహించి గమ్యాన్ని చేరుకోవాలని తెలిపారు. సెక్షన్-124 మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ చట్టం, సెక్షన్ 304, 183, రూల్-167 ప్రకారం ఎల్క్ట్రానిక్ పరికరాలైన స్పీడ్ కెమెరా, క్లోజ్డ్ సర్క్యూట్ టెలివిజన్ కెమెరా, స్పీడ్‌గన్, బాడీ వెరిటబుల్ కెమెరా, తదితర టెక్నాలజీ పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం భద్రత కోసం వాడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.గుర్రప్ప, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, క్లర్కులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

**చిన్నచౌక్ పీఎస్ పరిధిలో ర్యాలీ**

**కడప అర్బన్ :** జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి కె. ప్రత్యూషకుమారి సూచన మేరకు ×ద్విచక్ర వాహనాలు, పిలియన్ డ్రైవర్లు, వినియోగదారులు హెల్మెట్ ధరించడంపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తూ బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ నుంచి అప్సరా సర్కిల్ వరకు చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నచౌక్ సీఐ పి. నర సింహారెడ్డి, ఎస్ఐలు మహమ్మద్ రఫీ, రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



# మేలైన పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తి

**జిల్లా వ్యాప్తంగా 14వ తేదీ నుంచి పశుగ్రాస వారోత్సవాలు**



పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పశుగ్రాసంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కడప అగ్రికల్చర్ :** పాడి పశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం పెరగాలంటే మేలైన, నాణ్యమైన పశుగ్రాసాన్ని పచ్చిమేతగా అందించాలి. దాణాకన్నా పచ్చని పశుగ్రాసం మేతగా అందిస్తే అధిక పాలదిగుబడి సాధించడంతోపాటు.. పశువుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకున్న పశు సంవర్ధక అధికారులు పశుగ్రాసాల సాగు, ఎంపిక, పాల ఉత్పత్తి, పశువుల పోషణ అంశాలపై పాడి రైతులకు అవగాహన కల్పించేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా పశు వారోత్సవాలతో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. రైతులకు తమ కొద్దిపాటి పొలంలో ఏ రకమైన పశుగ్రాసం సాగు చేసుకోవాలి, ఏ రకం అధిక పాల దిగుబడి ఇస్తుంది? అంశాలను రైతులకు వివరించేందుకు సదస్సులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వారు సూచిస్తున్న వివరాలు పాడి రైతుల కోసం..

**మేలైన పశుగ్రాసం**

పశు గ్రాసానికి ఉపయోగపడే పంటలపై రైతులు దృష్టి పెట్టాలి. నీటి సౌకర్యం ఉన్నప్పుడు ధాన్యపు జాతి పంటలైన జొన్న, మొక్కజొన్న, సజ్జ, వర్షాధారంగా అయితే జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి, కొర్ర, అరికెల పంటలు వేసుకోవాలి. గడ్డి జాతికి చెందిన నేపియర్, బాజ్రా హైబ్రీడ్స్, గినీ గడ్డి, పారాగడ్డి, దీనానాథ్ గడ్డి, సివిల్, అంజన్, మార్వెల్, రోడ్స్, స్వియర్, సెటేరియా, బ్లూపానిక్, బ్రకారియా, జాన్సర్ వంటి గడ్డి రకాలు సాగు చేసుకోవచ్చు. పప్పు జాతికి చెందిన లూసర్న్, డెస్మాంథిస్, అలసందలు, బర్సీం, గోరుచిక్కుడు, సోయాచిక్కుడు, స్టైల్ డెస్కారియమ్స్, క్లిటోరియా, సెంట్రో, రైస్‌బీన్, మాతీబీన్, వెల్వెట్‌బీన్, స్వోర్డ్‌బీన్, కందులు, ఉలవలు, చిక్కుడు, తదితర పంటలు సాగు చేసుకోవచ్చు.

**గ్రాసం ఎలా వాడాలంటే...**

గ్రాసం వాడకంలోనూ పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. నాణ్యత గల అధిక పచ్చిమేత దిగుబడి పొందాలంటే పశుగ్రాస పంటల్ని 50 శాతం పూత దశలో కోయాలి. పశువుల మేతలో మూడు వంతుల గడ్డిజాతి పశుగ్రాసంతోపాటు ఒక వంతు పప్పు జాతి గ్రాసాన్ని కలిపి మేపితే పోషక విలువలు లభిస్తాయి. గ్రాసాన్ని కోసిన తరువాత చాఫ్ కట్టర్‌తో చిన్న ముక్కలుగా చేసి పశువులు సులభంగా తీసుకునేలా చేయాలి. జొన్న పశుగ్రాసాన్ని పూత దశ తర్వాత మాత్రమే పశుగ్రాసంగా ఉపయోగించాలి. చీడ పీడల నివారణకు పిచికారీ చేసే రసాయన మందులను కోతకు 15-20 రోజుల ముందు పిచికారీ చేసుకోవాలి. బాజ్రా నేపియర్ హైబ్రిడ్‌లను మొదటి కోత 70 రోజులకు మరియు తదుపరి కోతలను 45 రోజులకు తీసుకుని పశువులకు పచ్చిమేతగా అందించాలి.

**సమీకృత దాణాకు ప్రత్యామ్నాయం**



పశు పోషణలో సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా, చౌకగా లభించే అజోల్లాని ఉపయోగించుకోవచ్చు. అజోల్లా నీటిలో తేలియాడి, నత్రజని స్వీకరిస్తూ పెరిగే నాచు మొక్క, వీటికి వేర్లు, కాండము లేకుండా కేవలం ఆకులే ఉంటాయి, ఈ అజోల్లాతో పశువులకు అధిక మాంసకృత్తులు, మిటమిన్లు, ఖనిజ లవణాలు, సూక్ష్మ పోషకాలు లభిస్తాయి. రైతులు ఇంటి దగ్గర నీటి అవసరం అంతగా లేకుండా స్వల్ప విస్తీర్ణంలో తక్కువ కాలంలో అధిక దిగుబడితో సాగు చేసుకోవచ్చు.

– డాక్టర్ జి.రాంబాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, కడప

**అధికారుల సలహాలు తీసుకోవాలి**



పాడి పశువుల యాజమానులు పశుగ్రాస పెంపకంపై అవగాహన కలిగి ఉండాలి. పశుగ్రాసం సాగుకు ముందు అధికారులతో చర్చించి మంచి పశుగ్రాస రకాలను సాగు చేసుకోవాలి. అలా చేసుకుంటే పాడి రైతులకు మేలు జరుగుతుంది. ఏఏ రకాలు వాడితో ఎంతమేర పాల ఉత్పత్తి పెరుగుతుందో కూడా తెలుసుకుని అందుకు అనుగుణంగా సాగుచేసుకోవాలి. అధిక ఖరీదు చేసే సమీకృత దాణాను వాడటంతో పాల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది.

– డాక్టర్ శారదమ్మ, జిల్లా పశుగణాభివృద్ధి అధికారి, కడప

# రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు

**కొండాపురం :** కొండాపురం రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉప తహసీల్దారు, గతంలో తహసీల్దారుగా పనిచేసిన ఓ అధికారిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామ రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 133-4లో 33 సెంట్ల స్థలాన్ని దొంగ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు బాధితుడు పెద్దరంగారెడ్డిగారి చిన్నారెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఉప తహశీల్దారు రాజేశ్వరి ప్రమేయంతో ఆమె సమీప బంధువుకు స్థలం రిజిస్ట్రేషన్ అయిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో తహసీల్దారు ప్రభాకర్‌రెడ్డి(ప్రస్తుతం రిటైర్డ్ అయ్యారు), అప్పట్లో ఆర్ఐగా పనిచేసిన రాజేశ్వరి, వీఆర్వో, మరో ఐదుగురి సంతకాలు ఫోర్జరీ చేసి సమర్పించిన దొంగ పత్రాలతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు ఉప తహసీల్దారు, తహసీల్దారులపై చీటింగ్, క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఉప తహశీల్దారు రాజేశ్వరి వివరణ కోరగా పుల్లయ్య నుంచి తన బంధువు పట్టా భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. కర్నూలు లోకాయుక్త న్యాయస్థానంలో ఈ కేసు విచారణలో ఉందన్నారు.

# మిమ్మల్ని ఎవరు కాపాడుతారో చూస్తా

- పోలీసులపై టీడీపీ కౌన్సిలర్ భర్త వీరంగం
- పనిష్‌మెంట్ తప్పదు అంటూ పలుమార్లు తొడగొట్టిన వైనం



వరదరాజులరెడ్డితో కౌన్సిలర్ సరిత, ఆమె భర్త జయలింగారెడ్డి

**ప్రొద్దుటూరు :** అధికార పార్టీ నేతల దౌర్జన్యానికి అడ్డూఅదుపూ లేకుండాపోయింది. ఇందుకు ఉదాహరణే బుధవారం మధ్యాహ్నం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సంఘటన. ఓ పంచాయితీ విషయంపై మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు టీడీపీ కౌన్సిలర్ సరిత భర్త చింతకుంట జయలింగారెడ్డి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో వచ్చారు. అందుబాటులో ఎస్ఐ మంజునాథ్ లేరు. జయలింగారెడ్డి స్టేషన్ లోపలికి వెళుతుండగా అక్కడ ఉన్న కానిస్టేబుళ్లు గంగయ్య, రామాంజి మీరు ఎవరని అడిగారు. అయినా పట్టించుకోకుండా లోపలికి వెళుతుండటంతో 'మీరు ఎవరయ్యా.. మాకు తెలియదు' అని ప్రశ్నించారు. ఆగ్రహంతో ఊగిపోయిన కౌన్సిలర్ భర్త మీసం తిప్పుతూ అనేకమార్లు తొడగొట్టాడు. 'నన్నే ఎవరు అంటారా.. నా గురించి తెలియదా.. నా బ్యాక్ గ్రౌండ్ అడిగి తెలుసుకోండి, మిమ్మల్ని రాష్ట్రంలో ఎవరు కాపాడలేరు, సుండుపల్లి అవతలికి ట్రాన్స్‌ఫర్ చేయిస్తా' అని నోటికి వచ్చినట్లు దూషించాడు. సమయానికి వచ్చిన ఎస్ఐ హైమావతి 'అన్నా అలా మాట్లాడవద్దు' అని చెప్పినా వినిపించుకోకుండా ఆగ్రహంతో రెచ్చిపోయాడు. 'స్టేషన్‌కు వస్తే గౌరవించకుండా, ఎవరని తెలుసుకోకుండా మాట్లాడుతారా.. తొడగొట్టి చెబుతున్నా మీకు పనిష్‌మెంట్ తప్పదు' అని హెచ్చరించి వెళ్లిపోయాడు. మాజీ క్రికెట్ బుకీ జయలింగారెడ్డే పోలీసులనిలా మాట్లాడటమేమిటని ఆశ్చర్య పోయారు.